# "భక్తసుశీల"

శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు

నేను మాపెత్తండ్రిగారింట్లో యున్నాను. అక్కడ మాఅత్తగారు, ఆడబిడ్డయుండి నాతో యేవో లోకాభిరామాయణం మాట్లాడుతూయున్నారు. ఇంతలో సాతాను వేషధారులునలుగురు మా అమ్మగారింట్లోకి వెళ్లారు. వాళ్లెందుకల్లా వెళ్లారోయని పరికించాలని మాయింట్లోకివచ్చాను. ఒకసాతాని వేషధారి, ఒకపన్నెత్తు. పగటివేషధారిలాంటివానికి కొన్నిరూపాయిలప్పుయిమ్మని మాఅమ్మనడుగుచున్నాడు. నేనదివిని పన్నెత్తువేషగాడ్ని బాగాపరికించిచూచాను. నేనల్లాతన్ని చూడ్డమే అని నామీదకోపంగా వాడుచూచాడు. వీడెవడో మోసగాడురా అని తట్టింది. వెంటనే ఏమన్నానంటే 'ఓరీతులువా, నీకాఅప్పు, దొంగా, మాయదారీ! ఏదోనెపంగా మాయింట్లోప్రవేశించావురా! నీభరతంపట్టిస్తానుండు గోముఖవ్యాఘ్రమా!' అని మామూడోఅబ్బాయిని చాటుకుపిలిచి తక్షణం మాయింటికి దొంగలుచొరబడ్డారనిచెప్పి, పోలీసులను తీసుకు రమ్మని ఠాణాకుపంపాను. వాడు పరుగుపరుగున వెళ్లాడు..

ఈ సంగతి మావదినకు చెబుదామనివెళ్లాను. ఆవిడకుచెప్పి, పెరటిదారిని యింట్లోకివచ్చుచుండగా, నాపాదములకానుకొని ఏదోనాచేతిమీద గట్టిగాగోళ్లతో బరికినట్లైనది. ఇదేమి! దయ్యామాఅని క్రిందకు చూతునుకదా గుండెగుభేలుమన్నది. ఏమనిచెప్పను! పోలీసులను కేకవేయుటకై వెళ్లిన మాపిల్లవాడే కాళ్లు చేతులు మెలికలుత్రిప్పబడి వంకరలోయి సన్నంగాఅయి నడవలేక, ప్రాకి, దొర్లి, తనస్తితినాతోచెప్పుటకు నోరురాక నాకాళ్లకడ్డముపడి, చేతినిగట్టిగా నన్నచటఆపుటకై గోకినాడు. వాడ్ని అట్టిఅవస్తలోచూచిన నేను నిలువునీరై దుఃఖంపట్టలేక వాడ్ని కౌగలించుకొని 'నాతండ్రి ఈ స్థితినీకెట్లుకలిగిం'దని అడిగితే తను ఠాణానుంచి యింటికివచ్చేసరికి అమ్మమ్మ నాదొంగలు కొట్టుచున్నారనియు, నేనంత ఒకకఱ్ఱతీసుకొని వాళ్లనుకొట్టగా నన్నొకడుపట్టుకొని, బాది, కాళ్లుచేతులు మెలికలుత్రిప్పి, పెరటిలోకిగెంటాడనియు, అంత భయమేసి యీమంచాలచాటున దాక్కొంటినని సంజ్ఞారూపంగా చెప్పాడు. చంటిపిల్లలేమయ్యారో కదా? దొంగముండాకొడుకు లెంతపనిచేసారురాయని గుండెబాదుకుంటూ వాడ్ని అక్కడేదాగుకొనియుండమని యింట్లోకి వెళ్లబోవుచుండగా, పసిపిల్లకాళ్లకుచుట్టేసింది. దాన్నెత్తుకొని, సావిట్లోకి వెళ్లేసరికి ఎంతభీభత్స దృశ్యము! నెత్తుటిలోమునిగి మాఅమ్మ మరణించిపడియుంది. ఇల్లంతా దోపిడిఅయిపోయింది. ఎడపిల్ల కాన్పించదు. స్మశానాలమధ్య దయ్యంలాగ గుండెలుబాదుకుంటూ ఏడ్చుచూ తిరుగుచుంటిని. ఇంతలో పొరిగింటి కాడుకోబోయింది కాబోలును, మాయెడపిల్ల 'అమ్మా' అంటూవచ్చింది. గ్రుడ్డిలోమెల్లన్నట్లు, దుఃఖంలో ఆనందంకలిగింది. నాపిల్లలందరూ సురక్షితంగాయున్నారు. ప్రేమైకనిధానమగు, అమ్మలేదు. అమ్మవంటివస్తువీ జగతినిలేదు. మతిలేనిదానిలాగ, పిల్లల్నిచంక నేసుకొని, హత్య హత్య అంటూ పోలీసు ఠాణాకు పరుగెత్తాను. ఐదుగురుపోలీసుకానిస్టేబిల్సు మాత్రం గుమ్మంలోయున్నారు. వాళ్లకి సంగతంతాచెప్పి వీధికేసిచూతును కదా! మాయింటికొచ్చిన హంతకులు నలుగురాదారిని వెళ్లుచున్నారు. అదుగోదొంగలు వాళ్లే. పట్టుకోండని చెప్పాను. వెంటనే కానిస్టేబిల్సు వాళ్లనుపట్టుకొని ఖైదుకొట్లలోయుంచేసి, నాతో మాయింటికొచ్చారు.

మాఅమ్మచుట్టునిలబడి పరికించుచున్నారు. నాకు దుఃఖమెక్కువై దీనార్తిభంజనుడగు, భగవంతుడే నా మొరాలకించాలని పైకిచూచుచు మాఅమ్మకేసి చూపించుచు, దొంగలను చూస్తూ 'అనాథరక్షకా! దుష్టశిక్షకా! శిష్టరక్షకా! నా మొరాలకించు. మాఅమ్మను బ్రతికించి దుష్టులను శిక్షించు. గజేంద్రవరదా! ప్రహ్లాదరక్షకా' అని వేడుకొంటున్నాను. ఇంతలో మెరుపువలె మెరసి ఒక్కత్రుటిలో కొట్లలోయున్న నలుగురుదొంగలవిన్ని, నిలబడియున్న ఐదుగురు కానిస్టేబిల్సువి తలలు ఛేదింపబడ్డాయి. పోలీసులుకూడా దొంగజట్టులోని వేషధారికానిస్టేబిల్సని భగవంతుని దుష్టశిక్షణన్యాయంలో తేలింది.

ఇంతలో సబుయినస్పెక్టరుగారు కొందరుకానిస్టేబిల్సుతో యిల్లుచుట్టేసినారు. నావలన వాగ్మూలం విని రాసుకున్నారు. ఇందరియెదుట భక్తపరతంత్రుడగు నా శ్రీ కృష్ణభగవానుడు కస్తూరితిలకధారి శిఖిపింఛయుతుడు, మేఘశ్యాముడు, కౌస్తుభమణివక్షుఁడు, మురళీధరుఁడు, తులసీవనమాలాలంకృతుడు, రుక్మిణీసహితుడై, కుచేలునికివలె, సక్కుబాయికిమల్లే ప్రత్యక్షమయాడు. ఇఁక నా ఆనందము. పరమానందముగా బ్రహ్మానందముగా పరిణమించింది. ఎచ్చటయున్నానో తెలియుటలేదు. అమ్మకేసిమాత్రం చూపిస్తాను బ్రతికించమని; అంతలో చీకట్లాయింది. క్షణంలో మెరుపులావెలిగింది. అక్కడ అమ్మలేదు. రక్తకొల్లులేదు. పోలీసులులేరు. భయపడ్డాను. నాపాలిదైవము నన్నునిమిరి అమ్మనిపిలవమన్నాడు. 'అమ్మా! అమ్మా!' అని కేకవేస్తే, ఇల్లుఊడ్చి ఆకులువేయించమ్మా! వడ్డిస్తానని, పట్టుపంచకట్టుకొని, పడమటింటిలోనుండి జవాబుచెప్పింది. అమ్మా నాకృష్ణుడు లేడు. చీపురొకటి ఎలక్ట్రిక్ పవరులా ఈ ఇల్లూడ్చేస్తోంది. చటుక్కునగ్రహించి స్వామీ! తప్పని కనుమరిగిన శ్రీకృష్ణుని చేతిలోనుండి చీపురు లాక్కొని యిల్లూడ్చేసాను. నిమిషంలో మాయలాగ భీభత్సమైన యిల్లతిక్లీనుగా. అయింది.

చెప్పుట మరచాను. అంతకుముందే నాబిడ్డకూడా భగవంతుని కృపారసంచే నెప్పటివలె గుండులా గైయాడు. గతమంతా మరచిపోయాము. ఆదేవుని మాయాలీలాసముద్రమున చిక్కిన మనుజులిచ్చలు కొనసాగునా! ఆదృశ్యమే జ్ఞప్తిలేదు. ఇంతలో వడ్డనలైయాయి. సింహాసనంలాంటి మందిరంలో ఎత్తుపీటలపై, రుక్మిణీకృష్ణులు కూర్చుచున్నారు. నివేదన కమ్మవారపెట్టి తెమ్మన్నారొకరు. అందరికి ఆభగవాను డగుపించుటలేదు గనుక మామూలురీతి చెప్పారు. 'మ్రానులును, రాళ్లయందును, నరవరులచేత దేవరూపంబు కల్పించుట తెలివిలేక అవి పూజించుబుద్ధి నల్పబుద్ధి దేవతాబుద్ధి తన్నుతా దెలియుటయునే' అని తొల్లి శ్రీ కృష్ణుడర్జునునకు చెప్పినట్లు అసలమ్మవారయ్యవారి సమేతులైయుండగా కర్రబరిణలు యిత్తడి విగ్రహాలు కల అమ్మవారి పెట్టెందుక్రాయని, విస్తరులన్ని, ఆ లక్ష్మీనారాయణులకు, మంత్రపూతంగా నివేదించాను. పళ్లెంలో యింతకర్పూరం వెలిగించి 'లక్ష్మీపతే మంగళం' ఇదిగో కమలాపతేమంగళ' అని హారతిచ్చాను. ఆదంపతులు నవ్వారు. నేనత్యానందమున మైమరచి ఇదంతా భక్తకుచేలనాటకంలాగుంది స్వామీ! అన్నాను.. 'కాదు కాదు. ఇది భక్తసుశీల. అని అన్నారా కృష్ణపరమాత్మ. సక్కుబాయి సాయుజ్యముక్తిలా లీనమైన మనస్సుతో నన్ను నేనేతెలియని అవస్థలో నేనుండగా పడిపోయినట్లు మాగడియారం ఐదుగంటలు కొట్టింది. 'అమ్మా తలుపని చాసీదొచ్చి కేకేసింది. హృదయానందానికి బ్రేకుకలిగింది. కలో, నిజమో తెలియుటలేదు. మనసుకు బాగా తట్టిపోయింది. లేచాను కాని జరిగింది మరుచుదామన్నను మరపువచ్చుట లేదు. దీని ఫలాఫలములు పాఠకులే నిర్ణయింత్రుగాక.